క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

ఐరాల: కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాణిపాకంలోని ఎంజీ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి హాజరవుతారన్నారు. ఐదు మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్లు, నియోజకవర్గ, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సునీల్‌కుమార్ కోరారు.

ఘనంగా రాహుకేతు పూజలు



మొగిలి శివాలయంలో రాహుకేతు పూజల్లో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

శక్తి స్టీల్‌పై చర్యలు తీసుకోండి

కుప్పంరూరల్: నడుమూరు పంచాయతీలో ఉన్న శక్తి స్టీల్ ఫ్యాక్టరీ వల్ల పొలాల్లో పంటలు పండడం లేదని, జనం అనారోగ్యం బారిన పడుతున్నారని సోమవారం కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రం ఇచ్చారు. 15 ఏళ్లుగా పరిశ్రమ నడుస్తోందని, దీని నుంచి వచ్చే పొగ వల్ల పంటలు సక్రమంగా పండడం లేదని, చివరకు పశుగ్రాసంపై కూడా పొగ కమ్ము కోవడంతో గ్రాసం తిన్న పశువులు మృత్యువాత పడుతున్నాయని నివేదించారు. అంతే కాకుండా దట్టమైన పొగ వల్ల వసనాడు గొల్లపల్లె, జోగిండ్లు, రామబదనూరు, పైపాళ్యం, నడుమూరు, వసనాడు, చిన్న వసనాడు, ములకలపల్లె, బోదగుట్టపల్లె, బిరుదనపల్లె గ్రామస్తులు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని సమస్యలను ఏకరువు పెట్టారు. ఇకనైనా ఆ పరిశ్రమపై చర్యలు తీసుకుని ప్రజారోగ్యం కాపాడాలని కోరారు.

మోసం.. చంద్రబాబు నైజం



గుడిపాల: క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం



గుడిపాల: హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ప్రతి ఇంటికీ వెళ్లి బాబు మోసాలను చెబుదాం
- బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన విజయానందరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప
- గుడిపాలలో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం
- ఏడు నియోజకవర్గాల్లో గుడిపాలలోనే వైఎస్సార్‌సీపీకి మెజారిటీ



గుడిపాల: పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

గుడిపాల: కూటమి ప్రభుత్వ అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరిద్దామని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప పిలుపునిచ్చారు. సోమవారం గుడిపాల మండలంలోని వసంతాపురం పంచాయతీలో స్థానిక సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తుండడంపై మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మీపై జరిగిన దాడులన్నీ గుర్తు పెట్టుకోవాలని..వచ్చేది జగనన్న ప్రభుత్వమే అని.. అప్పుడు అన్ని లెక్కలు సరి చేద్దామన్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో మామిడి పంటకు ధర లేక రైతన్నలు అల్లాడుతున్నారని.. ఇందులో తెలుగుదేశం నాయకులు జోక్యం చేసుకుని వారికి కావాలసిన ట్రాక్టర్లను మాత్రమే లోపలికి పంపించి అన్‌లోడ్ చేసుకుంటున్నారని ఆరోపించారు. కొంత మంది రైతుల వద్ద పర్మిట్ల కోసం డబ్బులు డిమాండ్ చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మామిడి రైతులకు కిలో మామిడి రూ.25కి పైగా ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం మామిడి రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఇప్పటికీ కూడా రైతుకు కిలో ధరను చెప్పడం లేదన్నారు.

నట్టేట మునిగిన అన్నదాతలు

వైఎస్సార్‌సీపీ హయాంలో జగనన్న ప్రభుత్వం మే నెల చివరి నాటికి అర్హత ఉన్న ప్రతి రైతుకు వారి ఖాతాల్లో రైతు భరోసా పథకం కింద నిధులు జమ చేశారని గుర్తు చేశారు. అయితే నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏటా రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద అందజేస్తామని చెప్పినప్పటికీ నేటికీ అమలు చేయలేదని, ముఖ్యంగా పథకం అమలుపై పాలకుల్లో స్పష్టత కొరవడిందన్నారు. దీంతో పంటల సాగుకు అన్నదాతలు అప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. ఇక మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు రూ.1500 చొప్పున అందజేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జగనన్న అందజేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. కూటమి ప్రభుత్వ మోసాలను తెలియజేయాలని సూచించారు.

ప్రతి ఇంటికీ వెళ్లి వివరించండి..

ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రతి కుటుంబం ఎంత నష్టపోతుందో ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ అని బాండ్లు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కలిప్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు భృతి ఇస్తామని, ఆడబిడ్డ నిధి వంటి పథకాలు ఇస్తామని ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. పొదుపు మహిళలకు రూ.10 లక్షలు బ్యాంక్ లోన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఈ మోసాలన్నింటినీ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కలైఅరసి, నాయకులు మధుసూదన్‌రాయల్, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మనోహర్‌రెడ్డి, రెడ్డప్ప, సుధాకర్‌నాయుడుతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ కేసులు గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు



టీబీ పరీక్షలకు హాజరైన వృద్ధులు

తవణంపల్లె: క్షయ వ్యాధి కేసులు గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. పీహెచ్‌సీలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం కింద 60 ఏళ్ల పైబడిన 150 మందికి టీబీ పరీక్షలు నిర్వహించారు. 60 ఏళ్ల పైబడి పోషకాహార లోపం ఉన్నవారు మధుమేహం, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు, మద్యపానం సేవించే వారు తప్పక పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కీళ్లనొప్పి, తల, వెన్నునొప్పి లక్షణాలు కలిగినవారు పరీక్షలు చేసుకోవడం మంచిదని తెలిపారు. ప్రథమ దశలో పరీక్షలు చేసుకుంటే ప్రభుత్వం అందించే మందులతోనే వ్యాధి నయం చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, టీబీ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళలపై దాడి

పుంగనూరు: మండలంలోని ఉలవలదిన్నికి చెందిన మంగమ్మ, ఆమె కుమార్తె సావిత్రి, కోడలు రాధపై అదే గ్రామానికి చెందిన గణేష్ సోమవారం దాడి చేశాడు. ఈ దాడిలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన మహిళలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వైభవంగా ఉట్లోత్సవం



సీతారామ లక్ష్మణుల ఊంజల్ సేవ



మోహినీ అవతారంలో ఊరేగుతున్న శ్రీరాముడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రాములు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మోహినీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అర్చకులు సీతారామలక్ష్మణుల, ఆంజనేయ స్వామికి భక్తిశ్రద్ధలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. స్వామికి పూజలు చేసి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామికి ఉభయదారులు తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం మోహినీ అవతారంలో స్వామి పురవీధుల్లో దర్శనమిచ్చారు. సాయంత్రం ఉభయదారులచే ఉట్లోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో అర్చకులు స్వామికి చక్రస్నానం చేయించారు. రాత్రి ఆలయ వంశపార్యంపర ధర్మకర్త సిద్ధేశ్వర్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో ధ్వజావరోహణం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామికి ఏకాంత సేవ చేయించారు.

నేటి నుంచి ప్రత్యేక ఉత్సవాలు..

మంగళవారం ఉదయం ఆలయంలో సుప్రభాతం, తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపార్యంపర ధర్మకర్త సిద్ధేశ్వర్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం స్వామికి ఊంజల్‌సేవ, రాత్రి సూర్యప్రభ వాహన సేవలు నిర్వహిస్తామన్నారు.



పుష్కరిణి వద్ద ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు



పుష్కరిణిలో చక్రస్నానం ఆచరిస్తున్న అర్చకులు

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కళ్లను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన 40 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు చేశారు. అందులో 25 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం ×ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక× కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు ఎంఈ వెంకటరామిరెడ్డి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయి విచారణ చేసి సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో అందే ప్రతి ఫిర్యాదుపై తప్పనిసరిగా క్షేత్రస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజినీరింగ్ -5, రెవెన్యూ -4, పింఛను-2 చొప్పున మొత్తం 11 వినతులు అందాయి. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదా కాదు.. వృథా

- పల్లెల్లో నిత్యం వెలుగుతున్న వీధిదీపాలు
- స్విచ్‌లు లేకపోవడమే ప్రధాన కారణం
- పంచాయతీలకు కరెంట్ బిల్లుల మోత
- కట్టలేక కలవరపడుతున్న పంచాయతీ సిబ్బంది



యాదమరి విద్య డిగ్రీ కాలేజ్ వీధిలో ..



బుడితిరెడ్డిపల్లి ముస్లింవాడలో ఇలా ..

యాదమరి: విద్యుత్ అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతుంది. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోకపోవడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో రాత్రీపగలూ అని తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో వందలాది యూనిట్ల విద్యుత్ వృథా అవుతోంది. మండల పరిధిలోని బుడితిరెడ్డిపల్లి ముస్లింవాడలో గత నెల రోజులుగా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్ ఆదా చేయాల్సిన సంబంధిత అధికారులే విధి నిర్వహణలో అలసత్వం వహిస్తుండడం గమనార్హం. పంచాయతీ ఆదాయం, జనాభా ప్రాతిపదికన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి రాత్రిపూట ఆన్ చేసి ఉదయం ఆఫ్ చేయాలి. కానీ మండలంలో చాలా చోట్ల పల్లెల్లో నిత్యం వీధిదీపాలు వెలుగుతూనే ఉంటున్నాయి. దీంతో గ్రామపంచాయతీలకు రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ఆదాయం లేని కొన్ని పంచాయతీల్లో అయితే బిల్లులు చెల్లించలేక రూ.లక్షల్లో బకాయిలు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది సమన్వయలోపం కారణంగానే కొన్ని చోట్ల ఇలా జరుగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాడులు చేసి మామీదే కేసులా?



జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న బాధితులు

గంగవరం: 'మాపైన దాడులు చేసిన వారిపై కేసులు కట్టకుండా బాధితులైన మామీదే పోలీస్ స్టేషన్‌లో కేసులు కడతారా.. ఇదేం న్యాయం' అంటూ గంగవరం మండలం కలగటూరు గ్రామానికి చెందిన నాగరాజు, నాగమణి దంపతులు సోమవా రం చిత్తూరు ఎస్పీని ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కలగటూరు గ్రామంలో పాల డెయిరీ నడుపుతున్న మునేంద్రకు చెందిన రూ.60 వేల విలువ చేసే పాల నమూనాల యంత్రం ఈనెల 3న చోరీకి గురైంది. దీనిపై పలమనేరు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు మునేంద్ర ఫిర్యాదు చేశారు. అయితే గత 7వ తేదీన ఇదే గ్రామంలో ఉన్న బెల్ట్ షాప్‌లో మద్యం కొనుక్కున్న నాగరాజును గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ తన ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ మద్యం సేవిస్తుండగా అతని ఇంట్లో చోరీకి గురైన పాల యంత్రం కనిపించడంతో ఆ విషయాన్ని నాగరాజు ఫోన్ ద్వారా మునేంద్రకు సమాచారం ఇచ్చాడు. అంతలో అక్కడికి వెళ్లిన మునేంద్ర యంత్రం నువ్వే దొంగిలించావా..? అంటూ ఘర్షణకు దిగాడు. అనంతరం మునేంద్ర పాల యంత్రాన్ని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ కక్షతో నాగరాజు, అతని భార్య నాగమణిపై లక్ష్మీనారాయణతో పాటు సర్పంచ్ కుటుంబీకులు దాడికి పాల్పడ్డారు. తమపై జరిగిన దాడులు గురించి బాధితులు గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు తమపైనే తిరిగి కేసు కట్టారని వారు ఆవేదన చెందారు. తమ ఫిర్యాదును స్వీకరించకపోవడంతో ఎస్పీని ఆశ్రయించినట్లు చెప్పారు.

వేతనాలకే దిక్కులేదు.. నిధులు ఏమిస్తారు?

పూతలపట్టు(యాదమరి): నిరంతరం ప్రజాసేవలో తరించే తమకు గత 20 నెలలుగా వేతనాలకే దిక్కులేదు.. ఇక మండల అభివృద్ధికి నిధులు ఎలా మంజూరు చేస్తారని స్థానిక ప్రజాప్రతినిధులు నిలదీశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడీగా జరిగింది. ఎంపీపీ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ చాలామంది రైతులు వర్షాధార పంట అయిన వేరుశనగ సాగు చేసుకుంటున్నారని.. కానీ రైతులకు అవసరమైన విత్తనకాయలను అందించకపోవడంతో ఇబ్బందులు పడుతుంటే వేడుక చూస్తున్నారా ? అని ఏఓ మధుర వాణిని ఫోన్‌లో నిలదీశారు. కేవలం 150 నుంచి 200 వరకే ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని దుయ్యబట్టారు. అధికారులు కనీసం గౌరవం ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించట్లేదని సభను బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. తమ గ్రామంలో వర్షాలకు, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని.. తద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని పాటూరు ఎంపీటీసీ రాణెమ్మ విద్యుత్ శాఖను నిలదీశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను పలుమార్లు కలిసి విన్నవించినా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతులు తడిపితేనే కానీ పనులు చేయరా ? అని ప్రశ్నించారు. ఒక ప్రజాప్రతినిధి తమ గ్రామ సమస్యను పరిష్కరించమని కాళ్లరిగేలా అధికారుల వద్దకు తిరుగున్నా ఫలితం శూన్యం అని అన్నారు. ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటో అర్థమవుతోందని చెప్పారు. అనంతరం జవహర్ నవోదయ పాఠశాలకు దాదాపు 15 ఎకరాల స్థలం కేటాయించాలని స్థానిక తహసీల్దార్ రమేష్‌బాబుని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకుండా.. కూటమి ప్రభుత్వం సొంత పథకాలకు ఆ నిధులను మళ్లించుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీడీఓ నాగరాజు, తహసీల్దార్ రమేష్‌బాబు, ఏపీఓ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ ద్వారకానాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

పుంగనూరు: మండలంలోని ఈడిగపల్లెలో భాస్కర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనం ఆదివారం రాత్రి చోరీకి గురైంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సోమవారం పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం, జంగాలపల్లెకు చెందిన భాస్కర్ తన బంధువు ఈడిగపల్లెలో నివాసం ఉన్న శంకర ఇంటికి వచ్చి ఇంటి వద్ద వాహనం నిలిపాడు. ఆపై రాత్రి అక్కడే బస చేశాడు. ఉదయం లేచి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అయ్యోర్ల ఆకలి కేకలు

సమగ్రశిక్షా శాఖ అధికారులు నిర్వహిస్తున్న నిపుణ్ శిక్షణా కార్యక్రమంలో ఆకలికి అయ్యోర్లు కేకలు పెట్టారు. జిల్లా కేంద్రంలోని మిట్టూరులో ఉన్న అరుణాచల జూనియర్ కళాశాలలో నిపుణ్ శిక్షణను సోమవారం నుంచి ప్రారంభించారు. ఈ శిక్షణకు వివిధ ప్రాంతాల నుంచి టీచర్లు హాజరయ్యారు. అయితే వచ్చిన వారికి సమగ్రశిక్షాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో భోజనం పెట్టకపోవడంతో శిక్షణా కేంద్రంలో వారు ధర్నా నిర్వహించారు.

- నిపుణ్ శిక్షణకేంద్రంలో ఉపాధ్యాయుల ధర్నా
- 300 మంది హాజరైతే 100 మందికే భోజనం
- సమగ్రశిక్షాశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం
- శిక్షణల పేరిట నిధులను పక్కదారి పట్టిస్తున్న కూటమి ప్రభుత్వ పెద్దలు
- అనాలోచిన నిర్ణయాలపై విద్యావేత్తల ఆగ్రహం



శిక్షణా కేంద్రంలో భోజన కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యావ్యవస్థలో అనేక లోపాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచి విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. వేసవి సెలవుల్లో నిర్వహించాల్సిన శిక్షణా కార్యక్రమాలను పాఠశాలలు ప్రారంభమయ్యాక చేపడుతున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాల వల్ల ఒరిగేదేమీ లేకున్నప్పటికీ టీచర్లను ఇబ్బంది పెట్టాలనే నిర్వహిస్తున్నారు. శిక్షణల పేరిట నిధులను పక్కదారి పట్టించేందుకు కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలను అమలు చేస్తోందని విద్యావేత్తలే పెదవి విరుస్తున్నారు.

శిక్షణకు పిలిపించి అవమానించి..

రాష్ట్ర విద్యాశాఖ అధికారుల సూచనల మేరకు జిల్లా సమగ్రశిక్షా శాఖ అధికారులు ఈ నెల 14వ తేదీ నుంచి నిపుణ్ (నేషనల్ ఇన్సియేటివ్ ఫర్ ప్రొఫిషియెన్సీ ఇన్ రీడింగ్ విత్ అండర్‌స్టాండింగ్ అండ్ న్యూమరసీ) అనే శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణకు జిల్లాలోని పలు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు దాదాపు 300 మందిని పిలిపించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు శిక్షణను నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి శిక్షణకు పిలిపించిన ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు మధ్యాహ్నం భోజనం పెట్టకుండా అవమానించారు. ఈ శిక్షణకు విచ్చేసిన హెచ్‌ఎంలు సీనియర్లు కావడంతో వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి భోజనం పెట్టకపోవడంతో ఆగ్రహం లోనయ్యారు. భోజనం పెట్టలేనప్పుడు ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకోమని చెప్పి ఉంటే బాగుండేదని హెచ్‌ఎంలు సమగ్రశిక్షా శాఖ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలు అవుతున్నా మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఎందుకింత అలసత్వం..

శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుంది. ఇందుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో శిక్షణ కార్యక్రమంలో సమగ్రశిక్షాశాఖ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఆ దిశగా ముందస్తు ఏర్పాట్లు చేయడంలో జిల్లా సమగ్రశిక్షాశాఖ అధికారులు చర్యలు చేపట్టకపోడంతో ఎందుకింత అలసత్వం అంటూ హెచ్‌ఎంలు పెదవి విరిచారు. ప్రత్యేక బడ్జెట్ ఇచ్చినప్పటికీ శిక్షణా కేంద్రంలో 100 మందికి మాత్రం భోజనం చేయించి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ తతంగం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని హెచ్‌ఎంలు మండిపడ్డారు. సమగ్రశిక్షా శాఖ అధికారుల అలసత్వ తీరుపై హెచ్‌ఎంలు శిక్షణా కేంద్రంలో ధర్నా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై జిల్లా సమగ్రశిక్షాశాఖ అసిస్టెంట్ సీఎంఓ మధును వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ ఒక వెండర్ ఆర్డర్ ఇవ్వగా వాళ్లు మరొకరికి ఆర్డర్ ఇచ్చారన్నారు. మేమే నేరుగా తెప్పించి ఉంటే కరెక్టుగా తెప్పించేవాళ్లం. ఏపీసీ సార్ ముందే చెప్పారు తక్కువ చేస్తున్నారు ఎక్కువగా చేయండి అని. మరి ఎందుకు తక్కువ చేశారో అర్థం కావడం లేదు. రేపటి నుంచి పొరబాటు జరగకుండా జాగ్రత్తలు వహిస్తాం అని అన్నారు.